SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 828 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | గురువారం 18-06-2026

### దసరా నాటికి అందుబాటులోకి
## ఇంటిగ్రేటెడ్ టెర్మినల్



- గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ఉదయం పరిశీలించారు.
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు.
- ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందుతోందన్నారు.

గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగతా 2లో

### డీఎస్సీలో అక్రమాలపై
## చర్చకు సిద్ధం. మీరు సిద్ధమా?

డీఎస్సీ అవకతవకలపై చర్చను పక్కదారి పట్టించడమే లక్ష్యం
డీఎస్సీలో అక్రమాలు జరగనప్పుడు సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదు?
జగన్ గారి ప్రశ్నల్లో ఒక్కదానికైనా సమాధానం చెప్పావా?
తప్పు చేయకపోతే మీడియా ముందుకొచ్చి మాట్లాడటం లేదే?
వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఉద్యోగాలొచ్చిన వాళ్లతో కాదు, దగా పడ్డ అభ్యర్థులతో మీటింగ్ పెట్టండి





తాత పెట్టిన పార్టీ, తండ్రి ద్వారా సంక్రమించిన అధికారంతో నారా లోకేష్ విర్రవీగి ప్రవర్తిస్తున్నాడని, డీఎస్సీ అవకతవ కలపై చర్చను పక్కదారి పట్టించడానికే ఆయన సవాల్ చేసి పారిపోయాడని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ--2025 పై లోకేష్ సవాల్‌ని వైయస్సార్సీపీ స్వీకరిస్తు ందని, బహిరంగ చర్చకు ఎక్కడికి రమ్మన్నా తాము సిద్ధంగా ఉన్నామని, మా వెంట దగా పడ్డ అభ్యర్థులను కూడా తీసుకొస్తామని చెప్పారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలను మాజీ సీఎం వైయస్ జగన్ గారు ఆధారాలతో సహా బయట పెడితే మిగతా 2లో

- ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.
- "యోగాంధ్ర-2026" పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు.
- ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆయుష్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.
- యోగం కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా ఆరోగ్యవంతమైన జీవన విధానానికి మార్గమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.
- రాష్ట్ర ప్రజల్లో యోగా పట్ల మరింత అవగాహన పెంచేందుకు యోగాంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని అధికారులకు సూచించారు.
- యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి వర్గం ప్రజల భాగస్వామ్యం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### జూన్ 21న
## "యోగాంధ్ర-2026"

**సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు!**
**యోగా ద్వారా ఆరోగ్య విప్లవం.**
**శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం**



అమరావతి: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది."యోగాంధ్ర-2026" పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆయుష్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. మిగతా 2లో

### ఇప్పుడు టెలిగ్రామ్.. రేపు వాట్సాప్ బ్యాన్ చేస్తారా..?



- నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్ ' పై కేంద్రం నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు.
- కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా చేశారు.

నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్ ' పై మిగతా 2లో

### మంగళగిరిని రాష్ట్రంలోనే
## నెం.1గా తీర్చిదిద్దుతాం

**ఓటమి నాలో కసి పెంచింది..**

- జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు
- ఆమె గొంతు నొక్కలేరు: అనితకు మద్దతుగా నారా లోకేశ్
- మేకప్ మంత్రి అంటూ అనితపై గుడివాడ అమర్ నాథ్ అనుచిత వ్యాఖ్యలు
- అనితను టార్గెట్ చేయడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగుందని మండిపాటు



రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిని అన్ని రంగాల్లో నెం.1గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. మిగతా 2లో

### అద్దాల మేడలో ఉంటూ
## రాళ్లేస్తే రాళ్లే పడతాయి

**రౌడీ షీటర్ అయినంత మాత్రాన పోలీసులు చంపేస్తారా ?**

- సాయికృష్ణ హత్యపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ
- మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)డిమాండ్
- అమర్నాథ్ వ్యాఖ్యలపై ఎందుకింత రచ్చ ?
- ఆయన మేకప్ గురించి మాత్రమే మాట్లాడారు
- పవన్ మాత్రం కట్టుబొట్టూ డైలాగులు చెప్తున్నారు



జయవాడలో క్షీణించిన శాంతిభద్రతలకు విజయవాడలో పోలీసుల చేతిలో హత్యకు గురైన సాయికృష్ణ ఉదంతమే నిదర్శనమని వైఎస్సార్సీపీ నేత, మిగతా 2లో

## "ఇరాన్ సరిగ్గా ప్రవర్తించకపోతే మళ్లీ బాంబులే"

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వ్యాఖ్యలతో ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశారు.
- నెలల తరబడి కొనసాగిన యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరే దశకు చేరుకున్నప్పటికీ, అది ఇంకా అంతిమ ఒప్పందం కాదని ట్రంప్ స్పష్టం చేశారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వ్యాఖ్యలతో ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశారు. నెలల తరబడి కొనసాగిన యుద్ధానికి ముగింపు పలికేందుకు మిగతా 2లో

## లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ వైదొలగాల్సిందే

- ఒప్పందంలో ఈ అంశాన్ని చేర్చాం
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ వెల్లడి
- పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి, శాంతిని నెలకొల్పాలంటే లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వైదొలగాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తేల్చిచెప్పారు



పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి, శాంతిని నెలకొల్పాలంటే లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వైదొలగాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తేల్చిచెప్పారు. మిగతా 2లో

### కూటమి పాలనలో మనుషుల కంటే
## మేకప్‌కే విలువ ఎక్కువా?




- మహిళా గౌరవం టీడీపీ మహిళలకే పరిమితమా?
- మహిళలపై నేరాలు, వేధింపులు పెరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు
- మహిళా గౌరవం టీడీపీలోని మహిళలకు మాత్రమే పరిమితమా?
- ప్రతిపక్ష మహిళా నాయకులపై చేసిన వ్యాఖ్యలకు హోంమంత్రి అనిత సమాధానం చెప్పాలి మిగతా 2లో

- అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- ఏపీ సీఎం చంద్రబాబుతో అమరావతి సెక్రటేరియట్ లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశం నిర్వహించారు.
- గాదె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి లాకప్ డెత్ విమర్శలు, ఆరోపణలపై సీరియస్‌గా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.
- మరోవైపు సాయి కృష్ణను పోలీసులే చంపేశారని తల్లి ఆరోపిస్తున్నారు.
- కనీసం తమకు మృతదేహాన్ని అయినా అప్పగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం
## స్ఫూర్తిదాయకం

**సీఎంతో పవన్ కీలక సమావేశం..**
**సాయికృష్ణ లాకప్ డెత్ ఆరోపణలపై డీజీపీ వివరణ**
**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్**

ఏపీ సీఎం చంద్రబాబుతో అమరావతి సెక్రటేరియట్ లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశం నిర్వహించారు. గాదె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి లాకప్ డెత్ విమర్శలు, ఆరోపణలపై సీరియస్‌గా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా 2లో



### గొడ్డలి పార్టీ బతికితే
## రాష్ట్రానికి అంధకారమే



- గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందన్న అచ్చెన్నాయుడు
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన మంత్రి
- వెన్నుపోటు అనే పదానికి జగనే పేటెంట్ తీసుకున్నారని ఎద్దేవా

"గొడ్డలి పార్టీ మళ్లీ పుంజుకుంటే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లడం ఖాయమ"ని వ్యవసాయ శాఖ మంత్రి మిగతా 2లో

సీమకిరణం కర్నూలు నంద్యాల తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# ఉద్యోగులు పోరాటానికి సిద్ధం కండి : బొప్పరాజు

నెల్లూరు టౌన్, జూన్ 17, ( సీమకిరణం న్యూస్ ) : ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెలు సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర అమరావతి ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఫణిపేరాజు ఉద్యోగులకు పిలుపునిచ్చారు సోమవారం ఆయన నెల్లూరులోని వివిధ శాఖల నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి జీతాలు తప్ప రావలసిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఏమి మాకు రావడం లేదు అన్నారు ఉద్యోగులు పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమయపాలన లేకుండా ర్యాంకింగ్ల కోసం ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారన్నారు. మేం బోనస్ లు అడగడం లేదుఅన్నారు. మాకు రావాల్సిన బకాయిల గురించి చెప్పమంటున్నాం అన్నారు. పెరుగుతున్న ధరలు బరువైన ఈయంఐలతో మా కుటుంబాలు ఎలా గడపాలన్నారు. తక్షణ మే పే రివిజన్ జరగాలన్నారు. ఈ రోజు ఉద్యమ కార్యాచరణ నిమిత్తము, నెల్లూరులో వివిధ శాఖాపరమైన సంఘాల జిల్లా, డివిజన్ స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారితో ఉద్యమ కార్యాచరణకు దారి తీసిన పరిస్థితిని వివరించి, ప్రతి ఉద్యోగి ఉమ్మడి సమైక్యతను చాటే విధంగా ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఉద్యోగులందరూ కార్యాచరణకు సిద్ధంగా ఉన్నారని, ఇక ఆలస్యం లేకుండా ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ వెంటనే మొదలు పెట్టాలని సూచించగా ఉద్యోగులందరు ఏకగ్రీవంగా ఆయన అభిప్రాయాన్ని బలపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోషల్ మీడియాలో కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులు మాట్లాడుతున్నట్లుగా ప్రభుత్వానికి ఉద్యోగులు భారం కాదని, ఉద్యోగులు ప్రభుత్వానికి వెన్నుముక లాంటి వారిని గుర్తించాలని, అలాంటి ఉద్యోగులకు ఉన్న గౌరవప్రదమైన జీవితాన్ని ఆర్థికపరంగా దిగజార్చవద్దని తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వం మరియు అనేక రాష్ట్రాల్లో ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా మేము "బోనస్" లు అడగడం లేదని, గడువు దాటి మూడు సంవత్సరాలైనా కనీసం పిఆర్సి కమిషనర్ ని నియమించక పోవడాన్ని ఏవిదంగా చూడాలని, అధికారంలోకి రాగానే మంచి ఐ ఆర్ ని ప్రకటిస్తామని కూటమి మేనిఫెస్టో లో పెట్టినప్పటికీ నేటికి ఆ ఊసే ఎత్తకపోవడాన్ని ఏ విధంగా చూడాలని, ప్రతి ఆరు మాసాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు, ధరలకు అనుగుణంగా పెంచే డిఏలు, ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఒక్క డి ఏ కూడా విడుదల చేయకపోవడాన్ని ఏవిధంగా చూడాలని ప్రశ్నించారు. ఈ అంశాలపై ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో, ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఉద్యమ కార్యాచరణకు నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. ఇప్పటికే జూన్ 10వ తేదీన 28 జిల్లాల్లో జిల్లా కార్యవర్గ సమావేశాలు, పత్రికా సమావేశాలు నిర్వహించుకుని, సాధారణ ఉద్యోగులను సమాయత్తం చేసుకుంటూ, కలిసొచ్చే సంఘాలను కలుస్తూ, ప్రభుత్వంలోని గౌరవ మంత్రులను కలుస్తూ, వివరిస్తూ ఉద్యమానికి సమాయత్తం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ రోజు నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించుకుని జిల్లా, డివిజన్ స్థాయి నాయకులకు ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్న అంశాలను, ఉద్యమం ఎలా చేయాలో వారి నుండి సలహాలు స్వీకరించామని తెలిపారు.ఒకప్రక్క సమయపాలన లేకుండా ర్యాంకుల కోసం అనేక శాఖలలో ఏకకాలంలో అనేక పనులు అప్పగించి తీవ్రమైన పని వత్తిడి తెస్తున్నారని, ఇంకొక ప్రక్క అనూహ్యంగా పెరుగుతున్న మార్కెట్ ధరలు, బరువెక్కుతున్న ఈ యం ఐ లతో ఉద్యోగుల కుటుంబాలు ఎలా నెట్టుకురావాలని ప్రశ్నించారు.ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో గత పదిహేను సంవత్సరాలుగా రెండు లక్షల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న ఈ ప్రభుత్వంలో, రాష్ట్ర ఆదాయంలో 90% శాతం పైన ఉద్యోగులు ఖర్చులకే సరిపోతున్నాయని చెప్తూ, ప్రజల దృష్టిని ప్రభుత్వం మళ్లించటం దురదృష్టం అని తెలుపుతూ, ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం పెట్టే ఖర్చు పై మాకు స్పష్టమైన అవగాహన ఉందని సందర్భం వచ్చినప్పుడు ప్రజలకు, ఉద్యోగులకు అన్నీ వాస్తవాలు వెల్లడిస్తామని తెలియజేశారు. ఉద్యమ కార్యాచరణ కమిటీ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు మాట్లాడుతూ... పి ఆర్ సి అమలు సమయం దాటి ఇప్పటికే మూడు సంవత్సరాలు అయ్యిందని, కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో లో ప్రకటించిన విధంగా కనీసం మధ్యంతర భృతి (×=) కూడా విడుదల చేయలేదని, ఈ ప్రభుత్వ హయాంలో విడుదల కావాల్సిన డి.ఏలు ఒక్కటి కూడా విడుదల కాలేదని, ఈ ప్రభుత్వాన్ని నమ్మిన ఉద్యోగులకు కనీసం బకాయిల గురించి గానీ, ఆర్థిక అంశాలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేకపోవడం దురదృష్టమని, ప్రభుత్వం ఉద్యోగుల అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించిందని, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగుల ప్రయోజనాల కోసం తన బాధ్యతను విస్మరించకుండా ఉద్యమ కార్యాచరణని ప్రకటించేందుకు సమాయత్తం అవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచల రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా ఉద్యమాలకు పురిటి గడ్డ అని, ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధనకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం ఇచ్చే పిలుపును తూ.చ తప్పకుండా విజయవంతం చేస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ ఓ .వి.ప్రసాద్ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వైస్ చైర్మన్ మరియు ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల కుమార్ రెడ్డి , మరో వైస్ చైర్మన్ చంద్రశేఖర్, జిల్లా మహిళా చైర్మన్ శ్రీమతి వసంతకుమారి, మహిళా సెక్రటరీ శ్రీమతి చెన్నమ్మ జిల్లా కార్యవర్గ సభ్యులు థామస్, చెంచు రామయ్య, బి.మురళి, మాల్యాద్రి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు డానియల్ పీటర్ రావు, గోపి కృష్ణ, శ్రీమతి బాలకోటమ్మ, వెంకట్ ,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం నాయకులు మరియు ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ శాఖల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఉపకరణాల పంపిణీ





నెల్లూరు టౌన్, జూన్ 17, ( సీమకిరణం న్యూస్ ) : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బుధవారం ఉపకరణములనుజిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ పంపిణి చేసారు నెల్లూరు జిల్లాలో పాఠశాల విద్యా, సమగ్ర శిక్ష శాఖల ఆధ్వర్యంలో 38 మండల భవిత సెంటర్లలో 2748 ప్రత్యేక అవసరాలు కలిగి వున్న విద్యార్థులకు విద్యాబోధన, సౌకర్యాల కల్పన నిర్వహిస్తున్నారు.76 మంది సహిత విద్యా రిసోర్స్ పర్సన్ లు, 680 మంది విద్యార్థులకు నిరంతర ప్రాధమిక విద్యా, ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగ విద్యార్థులకు అందించడం జరుగుచున్నదన్నారు.వీరి కోసం స్పెషల్ ఎడ్యుకేటర్లు 37 మంది పని చేస్తున్నారు.ప్రతి సెంటర్లలో దివ్యాంగ విద్యార్థులకు భోజనాలు తినిపించడం దగ్గర నుండి వారికి కావాల్సిన అవసరాలను తీర్చుతూ సేవలను అందించడం జరుగుతుంది.7 మంది ఫిజియోథెరపిస్టులతో, ఫిజియోథెరపీ సేవలను అందిస్తూ ఇంటి ఆధారిత విద్యను అందించడం జరుగుచున్నదన్నారు భవిత సెంటర్లలో నమోదు అయిన విద్యార్థులకు వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్, సి.పి. కుర్చీలు, రోలేటర్లు, డిజిటల్ విద్య కోసం టాబ్స్, ట్రెయిలీ కిట్స్ మరియు ఇతర ఉపకరణములు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది దివ్యాంగ విద్యార్థులకు ఐజూ ద్వారా ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్ పోర్టు అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్ ల క్రిందరూ. 48.72 లక్షలను వారి వారి అకౌంట్స్ నందు జమ చేయడమైనది. బాలికా దివ్యాంగ విద్యార్థుల నిమిత్తం స్టయిఫండ్ కొరకు రూ.23.10 లక్షలు అందించడం జరిగినదన్నారు.ఈ రోజు 394 మంది విద్యార్థులకు రూ.22.14 లక్షల ఉపకరణముల వ్యయముతో పాఠశాల విద్యా సమగ్ర శిక్ష శాఖల ద్వారా బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్ళు, బ్రెయిలీ కిట్లు, సి.పి. వీల్ చైర్స్, రొలేటర్లు, త్రీ వీలర్ సైకిళ్ళు, వీలు చైర్లు, మడత వీల్ చైర్లు మొదలగునవి అందిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా వుందన్నారు.పాఠశాల విద్యా, సమగ్ర శిక్ష శాఖల వారు జిల్లాలో నిర్వహిస్తున్న భవిత సెంటర్లులలో దివ్యాంగ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో నమోదు చేయించుటకు తగు చర్యలు తీసుకొని వారికి విద్యను, ఇతర సౌకర్యాలను అందిపుచ్చుకొని వారి భవిష్యత్తును బంగారు బాటలో మార్చుటకు సమాజంలో వారిని ఉన్నత స్థానాలలో నిలపుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాన్నారు ఈ కార్యక్రమంలో నగర మేయర్ , డిఇఓ, ఏపీసి విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి











వెల్దుర్తి, జూన్ 17, (సీమకిరణం న్యూస్): కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కమ్మరి పోతులూరయ్య (61) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. కమ్మరి పోతులూరయ్య బుధవారం ఉదయం తన ఏపీ 39 ఎఫ్‌యూ 6475 నంబరు గల ద్విచక్ర వాహనంపై కృష్ణగిరి మండలం గుండ్లమల్లాపురం గ్రామంలో జరుగుతున్న కుటుంబ కార్యక్రమానికి బయలుదేరారు. ఉదయం సుమారు 9 గంటల 40 నిమిషాల సమయంలో వెల్దుర్తి గ్రామ శివారులోని డోన్ రైల్వే గేటు సమీపంలో జాతీయ రహదారి-44ను దాటుతుండగా, కర్నూలు వైపు నుంచి వచ్చిన కేఏ 51 జేజీ 6278 నంబరు గల మరో ద్విచక్ర వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వచ్చి ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోతులూరయ్య తీవ్రంగా గాయపడటంతో వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో లక్ష్మీనగరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను

# వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలి



దూదేకొండ లో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు (సీమకిరణం న్యూస్): జూన్ : 17 : టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.బుధవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామ సమీపంలోని కనకదిన్నె ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూనిట్‌లో కొనసాగుతున్న సివిల్ పనులు, యంత్రాల ఏర్పాట్లు, మౌలిక వసతుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత ఏడాది ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. యూనిట్‌కు సంబంధించిన ప్రాథమిక, ద్వితీయ ప్రాసెసింగ్ విభాగాల సివిల్ పనులు పూర్తయ్యాయని, యంత్రాల కొనుగోలు కోసం ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు నెలల్లో యంత్రాల ఏర్పాటు పూర్తయ్యి ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రధానంగా టమోటా కెచప్, టమోటా పల్ప్, టమోటా సాస్ తయారీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టమోటా సీజన్ ముగిసిన అనంతరం మామిడి, అరటి, జామ వంటి పండ్ల ప్రాసెసింగ్‌కు అనుగుణంగా యూనిట్‌ను పని చేస్తుందని తెలిపారు. టమోటా ధరలు పడిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని, అలాంటి సందర్భాల్లో రైతుల నుంచి టమోటాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయడం ద్వారా వారికి గిట్టుబాటు ధర లభించేలా ఈ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాసెసింగ్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంత రైతులు ఆయా రకాల సాగుపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. యూనిట్‌లో గంటకు 6 టన్నుల టమోటా పల్ప్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, రోజుకు సుమారు 3 మెట్రిక్ టన్నుల కెచప్ తయారు చేయగల సామర్థ్యం ఉంటుందని వివరించారు. నెలకు సుమారు 1,200 మెట్రిక్ టన్నుల టమోటాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రం పనిచేయనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా టమోటా రైతులకు మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విలువ ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి యూనిట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, తహసీల్దార్ రామేశ్వర రెడ్డి, ఏపీఎంఐపీడీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే సహకారంతో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

టీడీపీ నాయకులు శ్రీకాంత్





ప్యాపిలి జూన్ 17 (సీమ కిరణం న్యూస్) : ఎమ్మెల్యే సహకారంతో మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో కొత్త కొట్టలు కాలనీలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. గ్రామంలో కొన్ని కాలనీలో నెల రోజులుగా మంచినీటి కష్టాలు పడుతున్నాం. బోర్లన్నీ ఎండిపోయాయి. అని స్థానిక టీడీపీ నాయకులు శ్రీకాంత్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిస్తున్నారు. ఆయనకు గ్రామం తరపున కృతజ్ఞతలు అని గ్రామ నాయకులు శ్రీకాంత్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసిన ట్యాంకర్ల తాగునీటి సరఫరా చేస్తున్నందుకు కాలనీ వాసులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘానేత్రాల ఏర్పాటు

ఎస్సై అనిల్ కుమార్



ప్యాపిలి జూన్ 17 (సీమ కిరణం న్యూస్) : ప్రజల భద్రత, నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కీలక ప్రాంతాల్లో నిఘానేత్రాలు (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, పరిసరాలు మరియు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో జలదుర్గం కూడలి 2,చిగురుమాని సర్కిల్ 2, బావిపల్లి క్రాస్ 2పి ఆర్ పల్లి 3 ఈ కెమెరాలను ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు.సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, చోరీలు, ఇతర నేరాలను అరికట్టడం సులభమవుతుందని ఎస్సై పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు కూడా తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిఘానేత్రాల ఏర్పాటుతో ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రీ సర్వే కి రైతులు సహకరించాలి

డిప్యూటీ తహసిల్దార్ : కిషోర్ కుమార్ రెడ్డి



ప్యాపిలి జూన్ 17 (సీమ కిరణం న్యూస్) : ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామంలో భూ రీ సర్వే నిర్వహణపై గ్రామసభను నిర్వహించినట్లు డిప్యూటీ తహసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు.భూముల హద్దుల నిర్ధారణ, రికార్డుల సవరణ, వివాదాల పరిష్కారం వంటి అంశాల్లో రీ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. సర్వే సమయంలో రైతులు తమకు సంబంధించిన భూ పత్రాలు, ఆధారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.అలాగే సర్వే సిబ్బందికి అవసరమైన సమాచారం అందించి, ఎలాంటి అపోహలు లేకుండా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గి, రైతులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బమ్మ, వీఆర్వో సునీల్ కుమార్, ఆర్ ఈ నాగరాజు, తిరుపాల్ నాయుడు, కేసీ మద్దిలేటి, రమణ గౌడ్, గ్రామ రైతులు, సర్వేర్లు పాల్గొన్నారు.

# డోన్ లో ఎంఈఓకు జర్నలిస్టుల వినతిపత్రం





డోన్ టౌన్, జూన్ 17,(సీమ కిరణం న్యూస్): డోన్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కి జర్నలిస్టుల హక్కుల పోరాట సమితి ( జి హెచ్ పి ఎస్) యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. జర్నలిస్టు కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఎంఈఓ వారి వినతిని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# నార్లాపురంలో స్వచ్ఛ పథం కార్యక్రమం






వెల్దుర్తి, జూన్ 17 (సీమకిరణం న్యూస్): వెల్దుర్తి మండలం నార్లాపురం గ్రామంలో బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) మరియు అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతులు, పోషకాహార పంపిణీ తదితర అంశాలను తనిఖీ చేసి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో, చంద్రశేఖర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి, హరిత రాయబారులు, గ్రామ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# జిల్లా జైలు నందు న్యాయ అవగాహన సదస్సు

కర్నూలు (సీమకిరణం న్యూస్):జూన్ 17 : జిల్లా ప్రధాన న్యాయ మూర్తి / జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. కబర్ధి మరియు బి. లీలా వెంకట శేషాద్రి , కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూల్ వారు జిల్లా కారాగారము నందు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు నందు ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ " గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు వారికున్న హక్కుల ను తెలుసు కోవాలని తెలిపారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం మరియు సులోచన, హెల్ప్ డెస్క్ న్యాయ వాది ప్రవీణ్ కుమార్, ప్యారా లీగల్ వాలెంటీర్స్ హేమంత్, ఓం ప్రకాష్, శివాని,ఖైదీలు పాల్గొన్నారు.

## 30 ఏళ్లు దాటిన పురుషులు తప్పకుండా వీటిని రోజూ తీసుకోవాలి



పురుషుల్లో 30 ఏళ్లు దాటిన తరువాత నుంచి శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. ముఖ్యంగా కండరాల పనితీరు మందగిస్తుంది. కండరాలు కుచించుకుపోతుంటాయి. ప్రతి 10 ఏళ్లకు ఒకసారి 3 నుంచి 5 శాతం మేర కండరాల మోతాదు తగ్గుతుంది. దీంతో శక్తి నశించిపోతుంది. అయితే పురుషుల్లో కండర పుష్టికి టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ దోహదపడుతుంది. కానీ 40 ఏళ్లు దాటిన అనంతరం ఇది కూడా తగ్గుతుంటుంది. కనుక 40 ఏళ్లు దాటిన తరువాత నుంచి పురుషుల్లో గణనీయమైన మార్పులు వస్తుంటాయి. ముఖ్యంగా బరువు ఎత్తడం వంటి పనులు చేయలేకపోతుంటారు. కానీ ముందు నుంచే వ్యాయామం చేస్తే కండరాల క్షీణతను కాస్త నెమ్మదింపజేయవచ్చు.

### కండరాల క్షీణత ఎక్కువగానే..

రోజూ వ్యాయామం చేసే వారిలో కండరాల క్షీణత తక్కువగా ఉంటుంది. కనుక రోజూ కనీసం 30 నిమిషాల పాటు అయినా సరే వ్యాయామం చేయాల్సి ఉంటుంది. వ్యాయామం చేయడం వల్ల కండరాల క్షీణతను తగ్గించవచ్చు. అలాగే ప్రోటీన్లు ఉండే ఆహారాలను కూడా తీసుకుంటుండాలి. దీంతో కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇక జిమ్‌లలో వ్యాయామాలు చేసేవారు ప్రోటీన్ పొడులను తీసుకుంటూ ఉంటారు. ఇది ఈ మధ్య కాలంలో ఎక్కువైందని చెప్పవచ్చు. కానీ ఈ పొడులను డాక్టర్ సలహా మేరకు తీసుకోవాల్సి ఉంటుంది.

### ఎంత మోతాదులో..?

ఇక శారీరక శ్రమ, వ్యాయామం చేయకపోతే అలాంటి వారు రోజుకు తమ శరీర బరువులో ఒక కిలోకు 0.8 గ్రాముల ప్రోటీన్‌ను తీసుకుంటే చాలు. అయితే కండరాల నిర్మాణం కోరుకునే వారు మాత్రం 1.2 గ్రాముల వరకు ప్రోటీన్‌లను తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు 80 కిలోల బరువు ఉన్న వ్యక్తి రోజూ వ్యాయామం చేస్తుంటే రోజుకు సుమారుగా 95 గ్రాముల మేర ప్రోటీన్‌లను తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకు అవసరమైన దాంట్లో 20 నుంచి 40 శాతం ప్రోటీన్లను వ్యాయామం చేసిన గంటలోపు తీసుకోవాలి. దీంతో కండరాలు త్వరగా మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది.

### ప్రోటీన్లు ఉండే ఆహారాలు..

అయితే ఎంత ప్రోటీన్‌ను తీసుకుంటున్నాం అనేది తినే పదార్థాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా 85 గ్రాముల చికెన్ తీసుకుంటే అందులో 24 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. 225 గ్రాముల పెరుగు తింటే 23 గ్రాములు, ఉడికించిన పప్పులను ఒక కప్పు తింటే 18 గ్రాములు, 85 గ్రాముల చేపలతో 17 గ్రాములు, ఒక గుడ్డుతో 6.5 గ్రాములు, ఒక కప్పు పల్లీలతో 7 గ్రాముల ప్రోటీన్ లభిస్తాయి. కనుక ఈ మోతాదు ప్రకారం ప్రోటీన్లను లెక్కవేసుకోవాల్సి ఉంటుంది. ప్రోటీన్లు మనకు కోడిగుడ్లు, చీజ్, పనీర్, పిస్తా, పప్పు దినుసులు వంటి వాటి ద్వారా లభిస్తాయి. అన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల ప్రోటీన్లు సరిగ్గా అందేలా చూసుకోవచ్చు. ప్రోటీన్ల వల్ల కండరాలు నిర్మాణం అవుతాయి. శక్తి లభిస్తుంది. వయస్సు మీద పడిన తరువాత కండరాల క్షీణత వేగంగా ఉంటుంది కనుక ప్రోటీన్లను తింటే కండరాల క్షీణతను నెమ్మదింపజేయవచ్చు. ఈ విధంగా ప్రోటీన్లు మనకు మేలు చేస్తాయి.

## అప్పులలో రికార్డు



సూదిమొనంత పనిచెయ్యనోళ్లు ఏనుగంత అప్పు తెచ్చి రాష్ట్ర ప్రజల నెత్తిమీద రుద్దారు. అప్పు చేయడమే తప్పన్నట్టుగా ఇల్లెక్కి కూసినోళ్లు అప్పుల కుప్పలుగా తయారయ్యారు. పాత సర్కారు చేసిన అప్పుల మీద రోతమాటలు మాట్లాడినోళ్లు చేసిన అప్పుల లెక్క చూస్తే గుండె గుబేలనిపించక మానదు. అప్పు చేయడమే తప్పన్నోళ్లు అధికారంలోకి వచ్చి పది నెలలైనా పూర్తికాకముందే చేసిన అప్పు అక్షరాలా రూ.75,118 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని సర్కార్లు కలిసి చేసిన మొత్తం అప్పు రూ.72,658 కోట్లే. అది 60 ఏండ్ల అప్పు. ఆ సంగతి కాంగ్రెస్ శ్వేతపత్రంలోనే రాసుకున్నది. మరి ఏడాదికి రెండు నెలలు తక్కువ ఉండగానే అంతకుమించి అప్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎక్కడెక్కడో, ఏవేవో జామీనులిచ్చి తెచ్చిన అంతలావు సొమ్ము ఏం చేశారు? ఎక్కడ పోశారు? ఒక్క ఇటుక పెట్టలేదు. మీటరు గోడ లేపలేదు. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వలేదు. డీఏ కూడా ఇవ్వలేదు. ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేదు. మరి ఏమయ్యాయి అప్పు తెచ్చిన వేల కోట్లు? రైతుబంధు వేశారా? అంటే వేయలేదు. అన్నమాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేశారా? అంటే చేయలేదు. మహిళలకు, వృద్ధులకు పింఛన్లు పెంచలేదు. ఆడబిడ్డలకు తులం బంగారం పంచలేదు. కనీసం పుట్టిన పాపకు కేసీఆర్ కిట్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి అతీగతీ లేదు. దళితబంధు జాడే లేదు. ప్రాజెక్టు కట్టడం మాట దేవుడెరుగు, కనీసం కిలోమీటరు రోడ్డు కూడా వేయలేదు. బాండ్లు రాసిచ్చి మరీ తెస్తున్న అప్పునంతా ఎక్కడ ఖర్చు చేశారో చెప్పే నాథుడే కరువయ్యాడు. రూ.80 వేల కోట్ల కాళేశ్వరంలో లక్ష కోట్లు చేతులు మారాయని వితండవాదం చేసినవాళు దాదాపుగా అంతే మొత్తాన్ని తెచ్చి ఏ గొయ్యిలో పోశారో చెప్పలేకపోతున్నారు. కేసీఆర్ అప్పు తేలేదని ఎవరన్నారు? అప్పుచేసి తెచ్చిన సొమ్మును ఏం చేశారనేది అసలు సంగతి. ఆ సొమ్మును కేసీఆర్ సంపదను పెంచేందుకు వినియోగించడం వల్లే రాష్ట్రం అభివృద్ధిలో అంగలు వేసిందనేది ప్రత్యక్షర సత్యం. మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా నీళ్లు అందించారు. మిషన్ కాకతీయతో వేల చెరువుల పూడిక తీశారు. కాంగ్రెస్ సర్కారు కనీసం తట్టెడు మట్టి ఎత్తలేదు. చెంబెడు నీళ్లు ఇవ్వలేదు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొత్త పని ఒక్కటీ మొదలుపెట్టలేదు. అభివృద్ధి ఆగమైంది. సంక్షేమం సడుగులు ఇరిగినై. అప్పులు మాత్రం తుప్పల్లా పెరిగినై. ఏమయ్యాయి అప్పు చేసి తెచ్చిన నిధులు? అని ప్రజలు అడుగుతున్నారు. ఎవరి జేబుల్లోకి వెళ్లాయని నిలదీస్తున్నరు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరంతో కోటి రతనాల వీణ కోటి ఎకరాల మాగాణంగా రూపు సవరించుకుంది. రాష్ట్రం పచ్చగా కళకళలాడింది. ప్రజల బతుకులు మారాయి. మరి మూటల కొద్దీ పైసలు తెచ్చి కాంగ్రెస్ ఏం కట్టిందీ? అంటే సమాధానం సున్నా. తెచ్చిన అప్పులపై ప్రజలకు పైసా పైసా లెక్క చెప్పాల్సి ఉంటుందని కాంగ్రెస్ సర్కారు పెద్దలు గుర్తుంచుకుంటే మంచిది. సంపద పెంచి అందరికి పంచిన చరిత్ర కేసీఆర్‌ది. అధికారమే సోపానంగా, అడ్డగోలు హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలువదని ప్రజలకు మరోసారి తెలిసివచ్చింది.

## ఈస్టర్న్ లడాఖ్‌లో ఇండో-చైనా బలగాల కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్




ఈస్టర్న్ లడాక్‌లోని డెమ్‌చోక్‌లో రెండు దేశాల బలగాలు.. సహకార పద్ధతిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. భారతీయ ఆర్మీ వర్గాలు ఈ విషయాన్ని శుక్రవారం పేర్కొన్నాయి. త్వరలో దేప్‌సాంగ్ వద్ద కూడా కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈస్టర్న్ లడాక్‌లోని రెండు ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ బుధవారం ప్రారంభమైంది. 2020 మే నెల నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్తంగా ఉన్న అన్ని ప్రదేశాల నుంచి ప్రస్తుతం బలగాల ఉపసంహరణ జరిగినట్లు పేర్కొన్నారు.

## ఫిరాయింపులేనా ప్రజలను పట్టించుకోరా



'ఇంకేముంది బీఆర్ఎస్ పనైపోయింది. అందరూ మా వైపు వచ్చేస్తున్నారు. ఖేల్ ఖతం దుకనం బంద్' అంటూ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. వారన్నట్టే ఓ పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జారుకున్నారు. ఆ వలస అంతటితో ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం చూశాక తెలిసి తెలిసి ఆ పార్టీలో చేరడానికి ఎవరూ సాహసించడం లేదు. ఆశల రెక్కలొచ్చి ఎగిరిపోయిన ఎమ్మెల్యేలు సైతం స్థానిక కాంగ్రెస్ కుంపట్ల వేడి ఉక్కపోత భరించలేక సతమతమవుతున్నారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్న ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు తామింకా బీఆర్ఎస్సే అని బుకాయిస్తున్నారే కానీ, ధైర్యంగా 'మేం కాంగ్రెస్' అని చెప్పలేకపోతున్నారు. కొందరు తిరిగి సొంతింటికి రావడానికి ముహూర్తాలు చూసుకుంటున్నారు. విద్యార్థులు, యువత తమ సమస్య ల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమిస్తున్నారు. తులం బంగారం ఏద ని తల్లులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఏకంగా పోలీసులే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మత వైషమ్యాల ప్రమాదం మళ్లీ పొంచి చూస్తున్నది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదవిలో కొనసాగుతారా? లేక అనర్హత వేటుకు గురవుతారా? అన్న డోలాయమాన పరిస్థితి సద్దుమణిగిన తర్వాత కొత్త పీసీసీ అధ్యక్షుడు మళ్లీ పాత రాగాన్ని అందుకున్నారు. మరికొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమకు టచ్‌లో ఉన్నారని, వారిలో కేటీఆర్ సన్నిహితులు కూడా ఉన్నారని అరిగిపోయిన పాత రికార్డునే ఆయన మళ్లీ వినిపించారు. నిత్యం బీఆర్ఎస్‌ను బలహీనపరచాలనే యావ తప్ప, ఆవగింజంతైనా ప్రజలు కోరుకున్న పరిపాలన అందించాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేకపోవడం విడ్డూరం. చీలికలు, ఫిరాయింపులు అంటూ పదే పదే గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ వ్యవహారశైలి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకొస్తున్నది. వాస్తవానికి, కాంగ్రెస్ పార్టీలో వచ్చినన్ని చీలికలు, జరిగినన్ని ఫిరాయింపులు ఇతర ఏ పార్టీల్లో చోటుచేసుకోలేదు. ఆ దిశగా కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిది. కేంద్రంలో, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకం సజావుగా ఉంటే దేశంలో ఇన్ని పార్టీలు పుట్టి ఉండేవి కాదు. ఒకప్పుడు మన దేశాన్ని ఆసేతుహిమాచల పర్యంతం ఎదురులేకుండా ఏలిన కాంగ్రెస్ చివరికి ఉనికి కోసం చిన్నాచితక పార్టీల గుమ్మాల ముందు సాగిలపడే దుస్థితి ఉండేది కాదు. ప్రధానులు చరణ్‌సింగ్, వీపీ సింగ్, చంద్రశేఖర్, దేవెగౌడ, ఐకే గుజ్రాల్ నాడు కామరాజ్, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ మొదలుకొని నేటి శరద్ పవార్, చంద్రబాబు, మమతాబెనర్జీ వరకు దేశవ్యాప్తంగా ఎందరో అతిరథ మహారథులు గత ఆరు దశాబ్దాలలో కాంగ్రెస్ పార్టీకి దూరమైపోయినవారే. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ సంక్షోభాలు ఎదుర్కోలేదు. కానీ, ఇందిరమ్మ రంగప్రవేశం తర్వాతే కాంగ్రెస్ పార్టీ చీలికలు పీలికలైంది. దేశ చరిత్రలో తొలిసారిగా 1969లో అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతి అభ్యర్థి నీలం సంజీవరెడ్డి గెలువగలిగిన సంఖ్యాబలం కేంద్రంలో, రాష్ట్రాలలో పుష్కలంగా ఉండి కూడా ఓడిపోవడానికి సొంత పార్టీకి చెందిన ప్రధాని ఇందిరమ్మ అంతరాత్మ ప్రబోధం పేర జరిగిన క్రాస్ ఓటింగ్ కారణమైంది. ఇందిరమ్మపై బహిష్కరణ వేటు పడింది. పర్యవసానంగా ఢిల్లీ నుంచి గల్లీ దాకా పార్టీ నిలువునా చీలిపోయింది. అంతవరకు కాంగ్రెస్ పార్టీకున్న కాడెద్దుల ఎన్నికల గుర్తు కామరాజ్ నిజలింగప్ప వర్గానికి, కొత్తగా ఆవు దూడ గుర్తును ఇందిరమ్మ వర్గానికి ఎన్నికల కమిషన్ కేటాయించింది. కాంగ్రెస్ నిట్టనిలువునా రెండు ముక్కలైంది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ మూడు దశాబ్దాల జైత్రయాత్రకు బ్రేక్‌పడింది. ప్రధాని ఇందిర, ఆమె తనయుడు సంజయ్‌గాంధీ సహా కాంగ్రెస్ ఘనాపాటీలెందరో ఓడిపోయారు. ఎన్నికల్లో ఒక ప్రధాని ఓడిపోవడం, ఆ ప్రధాని సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో 85కు 85 సీట్లలో పార్టీ ఓడిపోవడం అదే తొలిసారి. తన వెంట నడిచిన నాయకులతో ఇందిరమ్మ 1978లో కొత్తగా మరో పార్టీ కాంగ్రెస్ (ఐ)ని స్థాపించి, చెయ్యి గుర్తుతో రంగంలోకి దిగారు. దీంతో కాంగ్రెస్ మరోసారి నిలువునా చీలిపోయింది. కాడెద్దుల కాంగ్రెస్, ఆవు దూడ కాంగ్రెస్, హస్తం కాంగ్రెస్ పరస్పరం ఎన్నికల్లో సుదీర్ఘకాలం తలపడ్డాయి. చీలికలు, ఫిరాయింపుల వల్ల కాంగ్రెస్ ఎన్నికల గుర్తులు రెండు కూడా (కాడెద్దులు, ఆవు దూడ) కనిపించకుండాపోయాయి. డజన్ల కొద్దీ పిల్ల కాంగ్రెస్‌లు పుట్టుకొచ్చాయి. అధికారం పెనుగులాటలో పేకముక్కలు మార్చినట్టు ముగ్గురు నలుగురు ముఖ్యమంత్రులు మార్చిన కాంగ్రెస్ వైపరీత్యాలకు మిగతా రాష్ట్రాల మాదిరిగానే సమైక్య ఆంధ్రప్రదేశ్ కూడా సాక్ష్యంగా నిలిచింది. అంతెందుకు ఎన్నికలై ఏడాదిన్నర అయ్యిందో, లేదో పక్కనే ఉన్న కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఉద్వాసన పలికే అంకానికి తెరలేచింది. తెలంగాణలో కూడా మంత్రులు, స్వపక్షీయులే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గోతులు తవ్వుతున్నట్టు సాక్షాత్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించిన విషయం గమనార్హం. ఐదున్నర దశాబ్దాలుగా బహిష్కరణలు, చీలికలు, వర్గాలు, కలహాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్‌తో పోల్చుకుంటే బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావం నుంచి శతధా, సహస్రధా పటిష్ఠంగానే ఉంది. ఐక్యంగానే ఉంది. ఏనాడూ పార్టీలో చీలిక రాలేదు. ఎన్నికల గుర్తులేమీ మారలేదు. అదే కారు గుర్తు. అదే కేసీఆర్ నాయకత్వం. ఆయన మాటే శిలాశాసనం. ఏ పొత్తులు లేకుండానే రెండుసార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. పదేండ్ల పాటు కేసీఆరే ముఖ్యమంత్రిగా పనిచేశారు. సమైక్య రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి హేమాహేమీలు శతవిధాలా ప్రయత్నించినా టీఆర్ఎస్ ప్రస్థానాన్ని అడ్డుకోలేకపోయారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 26 మంది టీఆర్ఎస్ సభ్యుల్లో పది మందిని నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి లాక్కున్నా, 2008 ఉప ఎన్నికల్లో, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలినా తర్వాత జరిగిన అన్ని ఉప ఎన్నికల్లో సత్తాచాటింది. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని యథావిధిగా ముందుకు నడిపించి రాష్ట్రాన్ని సాధించింది. 2014, 2018లో ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. ఈ కాలక్రమంలో వేళ్ల మీద లెక్కపెట్టగలిగేవాళు వెళ్లిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ బలం చెక్కుచెదరలేదు. నేడైనా అంతే. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకొని ఫిరాయింపులను వ్యతిరేకిస్తుంటే.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఫిరాయింపులను ప్రోత్సహించడం గమనార్హం. ఫిరాయింపులకు చోటే లేదని గత ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి ఏకంగా ఫిరాయింపుదారులను ఎలా శిక్షించవచ్చునో విడమర్చి మరీ చెప్పారు. ఫిరాయింపుదారులు అసెంబ్లీ గేటు తాకడానికి వీల్లేదని సభల్లో నినదించారు. కానీ, నిత్యం ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ బీఆర్ఎస్ ఖాళీ అన్నట్టు మాట్లాడుతుంటే.. వారికి చరిత్ర తెలియదనుకోవాలా? లేక ఒక వికృత మానసిక క్రీడకు ఒడిగట్టారని భావించాలా? పిల్లి శాపాలకు ఉట్టి తెగదు కదా? కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు ఒక హెచ్చరికగా భావించకుండా పదే పదే ఫిరాయింపు జపం చేయడం వెనుక ప్రజల దృష్టిని పక్కదారిపట్టించే కుట్ర దాగి ఉంది. అందుకు కారణం లేకపోలేదు. కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచి రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. రైతులు, విద్యార్థులు, యువత తమ సమస్య ల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమిస్తున్నారు. తులం బంగారం ఏద ని తల్లులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఏకంగా పోలీసులే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మత వైషమ్యాల ప్రమాదం మళ్లీ పొంచి చూస్తున్నది. పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు గాలికొదిలి మంత్రులు అధ్యయనం పేరిట విదేశీ పర్యటనల్లో తలమునకలై ఉన్నారు. ఏ ప్రభుత్వ హయాంలోనైనా గత ప్రభుత్వమే బాగుండేదని, ఆ రోజులే బాగుండేవని గుర్తుచేసుకుంటూ ప్రజలు పశ్చాత్తాపపడ్డారంటే అది వర్తమాన ప్రభుత్వ వైఫల్యాలకు పరాకాష్ఠ. ఆ దుస్థితిని కప్పిపుచ్చడానికి ఎప్పటికప్పుడు బూతులో, బుల్డోజర్‌లో, అక్రమ కేసులో, అభాండాలో ఏవైతేనేం.. ఒక అలజడి, ఒక సంచలనం సృష్టించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చి ఉపశమనం పొందవచ్చన్న ధ్యాస కాంగ్రెస్ అధికారగణంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. అందులో భాగంగానే పదే పదే ఫిరాయింపు పునరుక్తి దోషానికి ఆ పార్టీ పాల్పడుతున్నది. ఆకులు రాలినంత మాత్రాన చెట్టు మోడువారదు. మళ్లీ చిగురిస్తుంది. బీఆర్ఎస్ కూడా అంతే.

## ప్రజల మనిషి వట్టికోట



ప్రజల కోసమే పుట్టి, ప్రజల కోసమే బతికి, ప్రజల కోసమే మరణించినవారిని ప్రజలు మరిచిపోతారేమో కానీ, చరిత్రలో వారు సృష్టించుకున్న పేజీలు మాత్రం మరిచిపోలేవు. నిరంతరం వారి త్యాగా లను గుర్తుచేస్తూనే ఉంటాయి. వారు సృష్టించుకున్న చైతన్యదీప్తి ఈ సమాజాన్ని ఎప్పుడూ ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. అందుకే చరిత్ర ఈ మహనీయులను ప్రజల మనుషులుగా అభివర్ణిస్తుంది. ఆ విధంగా గుర్తించినవారిలో వట్టికోట ఆళ్వారుస్వామి ముందువరుసలో ఉంటారు. 'విశ్రాంతి తెలియనివాడు-స్వసుఖం కోరనివాడు వారం వారం మారనివాడు-రంగులద్దుకోలేనివాడు' అని వట్టికోట ఆళ్వారుస్వామిని కీర్తిస్తూ తన అద్భుతరచన 'అగ్నిధార'ను వట్టికోటకు అంకితమిచ్చారు మహాకవి దాశరథి. అంతేకాదు, కేతవరపు రామకోటి శాస్త్రి తన 'పీహెచ్‌డీ సిద్ధాంత' గ్రంథాన్ని, దాశరథి రంగాచార్య తన 'జనపదం' నవలను అంకితమిచ్చారు. తెలంగాణ తొలితరం నవలా సాహిత్యకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి స్ఫూర్తి, రాష్ట్ర సాధన కోసం సాగిన సాహిత్య, సాంస్కృతిక ఉద్యమంలో కీలక భూమికను పోషించిందని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'వట్టికోట'ను ప్రశంసించారు. ఎందరో మహనీయుల ప్రశంసలందుకున్న వట్టికోట 1915 నవంబర్ 1న నల్గొండ జిల్లాలోని చెరువు మాదారం గ్రామంలోని నిరుపేద (సింహాద్రమ్మ- రామచంద్రాచార్య) దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. కాంచనపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయునికి వండిపెడుతూ వట్టికోట తన చదువును కొనసాగించారు. ఆ తర్వాత గ్రంథాలయాలనే పవిత్ర ఆలయాలుగా భావించిన వట్టికోట నిరంతరం గ్రంథాలయాల్లోనే గ్రంథ పఠనం చేస్తూ సాహిత్య సౌరభాలను ఆఘ్రాణించారు. విజయవాడలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేసినప్పుడు అక్కడి సాహిత్యకారులతో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన వట్టికోట 1936-37లో గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా, ఆ తర్వాత మీజాన్ పత్రికలో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే ఆయనకు ఆంధ్ర మహాసభతో సాన్నిహిత్యం ఏర్పడింది. దాంతో ఆంధ్ర మహాసభ, నల్గొండ శాఖకు అధ్యక్షుడయ్యారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజ్ కార్యకర్తగా, అభ్యుదయ రచయితల సం ఘం, తెలంగాణ రచయితల సంఘం సభ్యుడిగా నిరంతరం ప్రజల కోసమే జీవించారు. ఇక నిజాం వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనడంతో ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలు పాలయ్యారు. జైలు లోపల గడిపిన రోజుల్లో అప్పటికే జైల్లో ఉన్న దాశరథితో సాన్నిహిత్యం ఏర్పడింది. జైలు గోడలపై బొగ్గుతో రాసిన దాశరథి కవితలను కంఠస్థం చేసేవారు. జైలు నుంచి విడుదలైన వట్టికోట సమాజ చైతన్యానికి విజ్ఞాన ప్రచారమే సాధనమని భావించారు. అందుకే సికింద్రాబాద్‌లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి పలువురు ప్రముఖుల గ్రంథాలను ప్రచురించారు. ఈ గ్రంథమాల సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'హైందవ ధర్మవీరులు', 'ప్రాథమిక స్వత్వములు' గ్రంథాలతో సహా 35 గ్రంథాలను ప్రచురించింది. అంతేకాదు ఊరూరా తిరుగుతూ ఈ గ్రంథాలను తక్కువ ధరకే విక్రయించిన వట్టికోట సమాజంలో చైతన్యదీప్తిని ప్రజ్వరిల్లజేశారు. సాహిత్య ప్రచార సారథిగా మాత్రమే కాదు, ఆయన తొలితరం నవలా రచయిత, కథకుడు, సంపాదకుడు, ప్రచురణకర్త కూడా. వట్టికోట కొంతకాలం 'తెలుగు తల్లి' అనే మాసపత్రికను నిర్వహించారు. 'తెలంగాణ' అనే వార్తాపత్రికను కూడా నడిపారు. ఆయన రాసిన 'ప్రజల మనిషి' 1938కి ముందు నిజాం పాలన కింద ఉన్న తెలంగాణ పరిస్థితులకు దర్పణం పడుతుంది. 'జైలు లోపల' అనే కథా సంపుటి తాను జైలులో స్వయంగా దర్శించిన ఖైదీల విభిన్న మనస్తత్వాలను విపులంగా విశదీకరిస్తుంది. ఇక 'గంగు' అసంపూర్ణ నవల 1940-45 మధ్య నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటానికి అద్దం పడుతుంది. 'రామప్ప రభస' వ్యాసాలు సామాజిక సమస్యలను కండ్లెదుట వ్యంగ్యంగా నిలుపుతాయి. అంతేకాదు వట్టికోట 'ధర్మరాజు' అనే కలం పేరుతో కూడా కొన్ని రచనలు చేశారు. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి. 1961, ఫిబ్రవరి 5న దివంగతులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం 2014, నవంబర్ 1న ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. అంతేకాదు, హైదరాబాద్‌లోని సిటీ సెంట్రల్ గ్రంథాలయానికి వట్టికోట ఆళ్వారుస్వామి పేరు పెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం.

## యవ్వనంగా కనిపించాలా అయితే పుట్టగొడుగులను తినండి



గ్రామీణ ప్రాంతాల్లో అయితే మనకు పుట్టగొడుగులు ఈ సీజన్‌లో ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే పుట్టగొడుగులను ఇప్పుడు చాలా మంది పండిస్తున్నారు. కనుక మనకు ఇవి ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉంటున్నాయి. పుట్టగొడుగులు ఫంగస్ జాతికి చెందినవి. వీటిని శాకాహారంగా చెప్పవచ్చు. పుట్టగొడుగులతో చేసే ఏ వంటకం అయినా సరే ఎంతో రుచిగా ఉంటుంది. అందుకనే రెస్టారెంట్లలో చాలా మంది వెజిటేరియన్లు పుట్టగొడుగులను తినేందుకు ఇష్టపడుతుంటారు. అయితే పుట్టగొడుగులు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల పలు అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.

### సూర్య కిరణాల నుంచి రక్షణ..

పుట్టగొడుగుల్లో బీటా గ్లూకన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి సాల్యుబుల్ ఫైబర్ జాతికి చెందినవి. హానికర బాక్టీరియాను ఇవి నిర్మూలిస్తాయి. దీంతో చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. అలాగే మొటిమలు, మచ్చల నుంచి విముక్తి లభిస్తుంది. కనుక పుట్టగొడుగులను తరచూ తింటుండాలి. వీటిలో ఎర్గోథియోనెయిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఒక అమైనో ఆమ్లం. ఇది యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది డీఎన్ఏకు మరమ్మత్తులు చేస్తుంది. సూర్యకాంతి వల్ల డ్యామేజ్ అయిన కణాలను తిరిగి పునరుద్ధరిస్తుంది. సూర్యుని నుంచి వచ్చే అల్ట్రా వయోలెట్ కిరణాల నుంచి, కాలుష్య కారకాల నుంచి రక్షణను అందిస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. పలు రకాల పుట్టగొడుగుల్లో పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల జాబితాకు చెందుతాయి. వీటిల్లో పాలిశాకరైడ్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని మృదువుగా మార్చుతాయి. తేమగా ఉండేలా చూస్తాయి. పుట్టగొడుగులలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాల నిర్మాణం సరిగ్గా ఉంటుంది. అలాగే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతో వయస్సు మీద పడుతున్నప్పటికీ యవ్వనంగా కనిపిస్తారు.

### స్కిన్ టోన్ మెరుగు పడుతుంది..

పుట్టగొడుగులలో మెలనిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మాన్ని హానికర కిరణాల నుంచి రక్షిస్తుంది. వీటిలో కోజిక్ యాసిడ్ ఉంటుంది. ఇది సహజసిద్ధమైన సమ్మేళనం. ఇది చర్మానికి కాంతినిస్తుంది. డార్క్ స్పాట్స్‌ను తొలగిస్తుంది. దీంతో స్కిన్ టోన్ మెరుగు పడుతుంది. పుట్టగొడుగులు అన్నీ కూడా తినేవి కావు, వీటిల్లో తినే పుట్టగొడుగులు వేరే ఉంటాయి. అయితే మార్కెట్‌లో మాత్రం తినే పుట్టగొడుగులనే విక్రయిస్తుంటారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చాలా పుట్టగొడుగు వెరైటీలు ఉన్నప్పటికీ మనం తినే పుట్టగొడుగులు మాత్రం 13 రకాలు మాత్రమే ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడంతోపాటు అందాన్ని కూడా ఇస్తాయి. అందువల్ల పుట్టగొడుగులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com